నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
5 | కరీంనగర్, బుధవారం 3 జూలై 2024 | PEDDAPALLI

## 'ఖని' కోదండ రామాలయానికి ₹10లక్షల విరాళం



ఆలయ ఈవోకు ₹10లక్షల చెక్కు విరాళంగా ఇస్తున్న ఎన్నారై రాధాకిషన్

కోల్‌సిటీ, జూలై 2 : గోదావరిఖనిలోని కోదండ రామాలయం అభివృద్ధికి ఓ ఎన్నారై భారీ విరాళం అందజేశారు. పాలకుర్తి మండలం కుక్కలగూడురుకు చెందిన పోతరాజుల రాధా కిషన్ అమెరికాలో ఉద్యోగ రీత్యా స్థిరపడ్డాడు. పదిహేను రోజుల క్రితం స్వదేశానికి వచ్చిన ఆయన, మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి రామాలయాన్ని సందర్శించారు. రామాలయం లోని రాజగోపురం, శివాలయంలోని రాజగోపురాల నిర్మాణం కోసం తనవంతుగా ₹10 లక్షల చెక్కును ఆలయ కార్యనిర్వహణాధికారి ముద్దసాని శంకరయ్యకు అందించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు అంబికాదేవి, శ్రీ చక్రధర్, ప్రధాన అర్చకులు మధుసూదనాచార్యులు, శశిధరా చార్యులు, చంద్రశేఖర శర్మ, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అయ్యో.. వానరా!

### కరెంట్ షాక్‌కు మూడు కోతులు బలి



పాలకుర్తి, జూలై 2 : ఓ కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి మూడు కోతులు బలయ్యాయి. కరెంట్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయాయి. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ ఉన్నతపాఠశాల వద్ద రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు తవ్విన ప్రదేశంలో కేశోరాం సిమెంట్ కర్మాగారం వీధిదీపాల అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ బయటపడింది. దీనిని ఎవరూ పట్టించుకోలేదు. మంగళవారం అటుగా వెళ్లిన తల్లి కోతి, పిల్ల కోతి, మరో కోతి ఆ కేబుల్‌కు తాకాయి. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే కోతులు చనిపోయాయని స్థానికులు మండిపడుతున్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## కేసీఆర్ ఆత్మీయ సమావేశంలో మన జడ్పీ అధ్యక్షులు



పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌ను సన్మానిస్తున్న అభినందిస్తున్న కేసీఆర్





అధినేత కేసీఆర్‌తో జగిత్యాల, సిరిసిల్ల జడ్పీ చైర్‌పర్సన్లు దావ వసంత-సురేశ్, న్యాలకొండ అరుణ-రాఘవరెడ్డి కుటుంబసభ్యులు

పెద్దపల్లి, జూలై 2(నమస్తే తెలంగాణ)/ జగిత్యాలటౌన్/ సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన నివాసంలో రాష్ట్రంలోని జడ్పీ అధ్యక్షులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా జడ్పీ అధ్యక్షులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్-శైలజ, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల జడ్పీ చైర్‌పర్సన్లు న్యాలకొండ అరుణ-రాఘవరెడ్డి, దావ వసంత-సురేశ్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్ల పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న జడ్పీ అధ్యక్షులందరికీ కేసీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల కోసం పని చేసే వాళ్లు నిజమైన నాయకులన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌దే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్లను కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కాగా, మంగళవారం కరీంనగర్ చివరి జడ్పీ మీటింగ్ ఉన్నందున జడ్పీ చైర్‌పర్సన్ కే విజయ హాజరుకాలేదు.

# గరంగరం.. ప్రశ్నల వర్షం



పోడియం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, సభ్యులు

### దద్దరిల్లిన కరీంనగర్ జడ్పీ చివరి సర్వసభ్య సమావేశం

- ఆద్యంతం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం
- డీఈవోను సస్పెండ్ చేయాలని పట్టుబట్టిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి
- సభ్యులతో కలిసి పోడియం వద్ద నిరసన.. తీర్మానం
- దళిత జడ్పీటీసీ, చైర్ పర్సన్‌ను అవమానించారని ఆందోళన
- పరస్పరం దూషణలతో గందరగోళం
- రెండో సెషన్‌కు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్
- జడ్పీ సభ్యులు, ఎంపీపీలకు సన్మానం

**సన్మానాలు.. సత్కారాలతో సాఫీగా జరగాల్సిన జడ్పీ చివరి సర్వసభ్య సమావేశం ఎన్నడూ లేనంత వాడీవేడిగా సాగింది. బీఆర్‌ఎస్ సభ్యుల ప్రశ్నల వర్షం, అధికారుల నిలదీతలతో దద్దరిల్లిపోయింది. డీఈవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి పోడియం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేయడం, ఈసందర్భంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ సభ్యులు పరస్పరం దూషణలకు దిగడం గందరగోళానికి దారితీసింది. మరో పక్క దళితబంధు రెండో విడుత నిధులు వెంటనే విడుదల చేయాలని టీషర్ట్ వేసుకుని వచ్చిన దళిత జడ్పీటీసీ శ్రీరాం శ్యామ్‌ను పోలీసులు అవమానకరంగా గేటు బయటి వరకు వెళ్లగొట్టడంపై పెద్ద దుమారమే రేగింది. కాగా, మధ్యాహ్న భోజనం తర్వాత మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీ అధ్యక్షురాలు ఉద్వేగానికి లోనయ్యారు.**

కరీంనగర్, జూలై 2 (నమస్తే తెలంగాణ): జడ్పీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ అధ్యక్షతన మంగళవారం కరీంనగర్ జడ్పీ చివరి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మొదట వైద్య, ఆరోగ్య శాఖపై చర్చ జరగ్గా.. మానకొండూర్, శంకరపట్నం సభ్యులు అధికారులపై ప్రశ్నలు సంధించారు. అధికారుల సమాధానాలతో సంతృప్తి చెందని సభ్యులు, ఐదేళ్లుగా ఇలాంటి మాటలే వింటున్నామని, ఇంకెప్పుడు సమస్యలు పరిష్కరిస్తారని ప్రశ్నించారు. అనంతరం విద్యా శాఖపై చర్చకు రావడంతో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి లేచి ముందుగా డీఈవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో వచ్చి కూర్చున్న కలెక్టర్ పమేలా సత్పతికి జరిగిన విషయం చెప్పారు. ఇటీవల విద్యాశాఖపై సమీక్షించానని, ఆ సమావేశానికి హాజరైన ఎంఈవోలు, హెచ్‌ఎంలకు డీఈవో జనార్దన్ రావు మెమోలు జారీ చేశారని, ఎంఈవోలుగా ఇన్‌చార్జి బాధ్యతల నుంచి హెచ్‌ఎంలను తప్పించారని, ఆయనకు ఈ అధికారం ఎక్కడిదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఒక ఎమ్మెల్యేగా తనకు నియోజకవర్గంలో శాఖల పని తీరును సమీక్షించే అధికారం లేదా..? అని అడిగారు. దీంతో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన చిగురుమామిడి జడ్పీటీసీ గీకురు రవీందర్ అభ్యంతరం చెప్పారు. కొత్తపల్లి జడ్పీటీసీ పిట్టల కరుణతోపాటు మరో ఇద్దరు సభ్యులు, ఎంపీపీలు ఆయనకు మద్దతుగా బీఆర్‌ఎస్ సభ్యులపై మాటల దాడికి దిగారు. దాంతో ఎమ్మెల్యే ఆగ్రహించి, కాంగ్రెస్‌కు అమ్ముడు పోయిన మీరు మాట్లాడుతున్నారా..? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పరస్పరం వ్యక్తిగత దూషణలకు దిగారు. ఆ సమయంలో సమావేశం నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించిన కలెక్టర్‌ను బీఆర్‌ఎస్ సభ్యులతో కలిసి కొద్దిసేపు అడ్డుకున్నారు. ఒక ఎమ్మెల్యేగా ఉన్న తన హక్కులకు భంగం కలిగించే రీతిలో వ్యవహరించిన డీఈవోను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోగానే.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సభ్యుల మధ్య మరోసారి వివాదం ముదిరింది. జడ్పీ అధ్యక్షురాలు ఎన్నిసార్లు విన్నవించినా సభ్యులు పట్టించుకోలేదు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి విజ్ఞప్తి మేరకు డీఈవోను సస్పెండ్ చేయాలని శంకరపట్నం జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, మానకొండూర్ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్ ఆమోదించారు. తీర్మానం పాసైనట్టు జడ్పీ అధ్యక్షురాలు విజయ ప్రకటించారు. దీనిని ప్రభుత్వానికి నివేదిస్తామని ఆమె వెల్లడించారు.

### దళిత జడ్పీటీసీకి అవమానం

సర్వసభ్య సమావేశం సాక్షిగా ఓ దళిత జడ్పీటీసీకి సభ్యుడికి అవమానం జరిగింది. జమ్మికుంటకు చెందిన దళిత జడ్పీటీసీ శ్రీరాం శ్యామ్ దళితబంధు రెండో విడుత నిధులు ఇవ్వాలని అంబేద్కర్ బొమ్మతో ఉన్న టీ షర్ట్ ధరించి సమావేశానికి హాజరయ్యేందుకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు గేటు వద్దనే నిలిపివేశారు. ఆ టీ షర్ట్‌ను తీసేసి వేరే షర్టు వేసుకుని వస్తేనే అనుమతిస్తామని చెప్పారు. అందుకు శ్యామ్ ఒప్పుకోక పోవడంతో చాలాసేపటి వరకు గేటు వద్దనే నిలబెట్టారు. 'మీరు ఇక్కడ ఉండద్దు. షర్ట్ మార్చుకొని సమావేశానికి రండి. లేదంటే ఇక్కడి నుంచి వెళ్లిపోండి' అంటూ హుకుం జారీ చేశారు. అయినా ఆయన వెళ్లకుండా అక్కడే ఉండడంతో బలవంతంగా జడ్పీ మెయిన్ గేటు వరకు తీసుకెళ్లి వదిలేశారు. ఇదే విషయమై జడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చ జరిగింది. మునుపెన్నడూ చూడని విధంగా జడ్పీ సమావేశం పోలీసుల నిర్బంధంలో నడుస్తున్నదని మానకొండూర్, శంకరపట్నం జడ్పీటీసీలు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. 'మేం నక్సలైట్లమా..? టెర్రరిస్టులమా..?' అన్నట్టు ఏమిటీ నిర్బంధమని ప్రశ్నించారు. జడ్పీటీసీ శ్యామ్‌ను వెంటనే సమావేశానికి అనుమతి ఇవ్వాలని బీఆర్‌ఎస్ సభ్యులు ముకుమ్మడిగా డిమాండ్ చేశారు. దీంతో జడ్పీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ స్పందించి శ్యామ్‌ను లోనికి రానివ్వాలని పోలీసులకు చెప్పారు. తమకు జడ్పీ సీఈవో చెప్పాలని అక్కడ ఉన్న పోలీస్ అధికారులు స్పష్టం చేయడంతో మరోసారి సీఈవోకు చెప్పారు. ఆయన మౌనంగా ఉండిపోయారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.. ఇది ఒక్క జమ్మికుంట జడ్పీటీసీకి జరిగిన అవమానం కాదని, ఒక జడ్పీ అధ్యక్షురాలికి తద్వారా సభకు అవమానం జరిగిందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కూడా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది.

### సభ్యులకు సన్మానం



జడ్పీసభ్యులు, ఎంపీపీలతో మంత్రి పొన్నం, జడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

ఐదేళ్లపాటు సేవలందించిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీల పదవీ కాలం ఈ నెల 5తో ముగియనున్నది. మంగళవారం చివరి సమావేశం కావడంతో జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, జడ్పీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జడ్పీ అధ్యక్షురాలు తన ఐదేళ్ల ప్రస్తానాన్ని గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రతి మగవాడి విజయం వెనక ఒక మహిళ ఉంటుంది అంటారని, కానీ తన విజయాల వెనక తన భర్త గణపతి ఉన్నారని విజయ అన్నారు.

### మంచిసేవలతో చిరకాలం గుర్తింపు



రాజకీయాలు వేరు.. ప్రజా సేవ వేరు. ప్రజలకు మంచిగా సేవలందిస్తే ఎవరైనా చిరకాలం ప్రజల గుండెల్లో నిలిచిపోతారు. ప్రజాస్వామ్యంలో ఐదేళ్లు ఎంపీగా పనిచేశా. అనుభవజ్ఞులైన ఎందరో జడ్పీకి సారథ్యం వహించారు. వాళ్లంతా అక్కడితో ఆగకుండా ఇతర పదవులు చేపట్టి ప్రజల మన్ననలు పొందారు. నాయకులు అనే వాళ్లు అధికారం ఉన్నా.. లేకున్నా ప్రజల్లోనే ఉండాలి. జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. జిల్లా సమస్యలపై ఎప్పుడైనా నన్ను కలువవచ్చు. పార్టీలకతీతంగా పని చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో స్థానిక సంస్థలను భవిష్యత్తులో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం.

- మంత్రి పొన్నం ప్రభాకర్

### డీఈవో చర్యలు చట్టవిరుద్ధం

ఒక నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా నా పరిధిలోని ప్రభుత్వ శాఖలను సమీక్షించే అధికారం నాకు ఉంటుంది. నేను నిర్వహించిన సమీక్షకు హాజరైన ఎంఈవోలకు, హెచ్‌ఎంలకు డీఈవో మెమోలు జారీ చేయడం చట్ట విరుద్ధం. ఈ విషయంలో నేను ఎంత వరకైనా పోరాడతా. నా హక్కులను అవమాన పరిచిన డీఈవోను సస్పెండ్ చేయాలి. లేదంటే ప్రివిలియెన్స్ మోషన్ తీసుకుంటాం. త్వరలో స్పీకర్‌ను కలుస్తా. అక్కడ కూడా స్పందన లేకపోతే హై కోర్టుకు వెళ్తా. ఒక దళిత జడ్పీటీసీని పోలీసులు అవమానించారు. దళితబంధు పైలెట్ ప్రాజెక్టు కింద హుజూరాబాద్‌లో అమలైంది. ఇంకా 4,500 మందికి రెండో విడుత గ్రాంట్ రావల్సి ఉన్నది. దళితబంధు నిలిపివేయాలని ఆదేశాలు వచ్చినట్టు స్వయంగా కలెక్టర్ మీడియా సాక్షిగా చెప్పారు. యావత్ తెలంగాణలో ఉన్న దళితులు ఆలోచించాలి. ఈ విషయమై నేను అసెంబ్లీలో కూడా మాట్లాడా. దళితబంధు వెంటనే విడుదల చేయాలి.

- మీడియాతో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన జడ్పీ సభ్యులు, అధికారులు

### దళితుడిననే చిన్నచూపు



నేను దళితుడిననే చిన్నచూపు చూశారు. నా జాతికి న్యాయం చేయాలనే నిశ్చయంతో జడ్పీ సర్వసభ్య సమావేశానికి టీ షర్ట్ వేసుకుని వెళ్తే కనీసం గేటు దగ్గరికి కూడా రానీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఇది చివరి సమావేశమని, చివరి సారిగా అందరం కలుసుకుంటున్నామని ఎంత బతిమిలాడినా కరీంనగర్ ఏసీపీ నన్ను లోనికి అనుమతించలేదు. పార్లమెంట్, అసెంబ్లీలోకి వెళ్లేటప్పుడు ఆయా పార్టీల ఎమ్మెల్యేలు కండువాలు కప్పుకొని పోతారు. ప్రజల సమస్యలను ఏకరువు పెట్టడానికి కొన్ని నమూనాలు తీసుకెళ్తారు. జిల్లా స్థాయిలో ఇది కూడా ఒక సభే అయినందున నేను ఈ రకమైన టీ షర్టును ధరించి వెళ్లా. ఇది నేను చేసినా తప్పా? దళితబంధు రెండో విడుత డబ్బులు విడిపించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే ఆంక్షలు విధిస్తున్నది. నాకు అవమానం జరిగినా పర్వా లేదు కానీ, నా జాతికి అవసరమైన గ్రాంట్‌ను విడుదల చేయాలి.

- శ్రీ రామ్ శ్యామ్, జమ్మికుంట జడ్పీటీసీ




కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 2: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మెరుగైన వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమై 20రోజులు గడిచినా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఈ మేరకు ఆ సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 'చలో కలెక్టరేట్' నిర్వహించారు. అనంతరం సంఘం ప్రతినిధి రామకృష్ణ మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కుచట్టం 2005 ప్రకారం పేద, బలహీనవర్గాల విద్యార్థులకు 25శాతం ఉచిత విద్యను అందేలా చూడాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. హాస్టల్ మెస్‌చార్జీలు పెంచాలని, కేబినేట్‌లో విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు. లేనిపక్షంలో విద్యారంగ నిర్వీర్యానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.




జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

## రెండు లక్షల పోస్టులు భర్తీ చేయాలి

జగిత్యాల టౌన్, జూలై 2: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట నిరుద్యోగుల పక్షాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ మాట్లాడారు. గ్రూప్-2, 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులు పెంచాలని, 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో లేనిపోని హామీలతో విద్యార్థులు, నిరుద్యోగులను నమ్మించి మోసం చేశారని, విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా విద్యార్థి, నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. లేకుంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ధర్నాలో ఏబీవీపీ నగర కార్యదర్శి రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనువాడ నందు, మాడవేని సునీల్, జోనల్ ఇన్‌చార్జి ప్రశాంత్ సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

## 4న సబ్ జూనియర్స్ బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

కొత్తపల్లి, జూలై 2 : నగరంలోని సెయింట్ జాన్ ఉన్నత పాఠశాలలో ఈనెల 4న ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్స్ బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గణపతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2011 జనవరి 1 నుంచి 2012 డిసెంబర్ 31లోపు జన్మించిన వారై ఉండాలన్నారు. వివరాలకు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంతటి శంకరయ్యను సెల్ నెంబర్ 9849114956లో సంప్రదించాలన్నారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం

మరియు

- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571